# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 194 | పేజీలు : 08 | శుక్రవారం | 24-07-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయి

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయట్లేదు?
- మేం తెరిచిన ధర్నాచౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామని అంటున్నారు
- విలేకరుల చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

2



**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఓట్ల ప్రక్షాళన కార్యక్రమం చాలా ముఖ్యమని తమ పార్టీ నేతలకు గట్టిగా చెప్పినట్లు సీఎం రేవంత్ తెలిపారు. అసెంబ్లీలో జరుగుతున్న మరమ్మతు పనుల పరిశీలన అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో అనేక అంశాలపై సీఎం స్పందించారు. ఓటరు జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్), గ్లోబరీనా సంస్థ వ్యవహారం, కాళేశ్వరం ప్రాజెక్టు, హైడ్రా పనితీరు, బీఆర్ఎస్, బీజేపీలపై స్పందించారు.ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని చెప్పిన సీఎం..ఎస్ఐఆర్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటికే 70 శాతం పూర్తయిందని, ఇంకా 30 శాతం మిగిలి ఉందని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితాలో చిన్న పొరపాట్లు కూడా సరిచేసుకోవాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీ



## ప్రతి చుక్కనూ కాపాడుకుందాం

- ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రతి వర్షపు చుక్కనూ కాపాడుకుందాం: మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్‌నినో కారణంగా తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న పొన్నం
- అధికారులకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ఆరుతడి పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచన

2

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు

## పుట్టినరోజు వేడుకలకు దూరం

- పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని కేటీఆర్ నిర్ణయం
- నేడు కేటీఆర్ పుట్టినరోజు
- విద్యార్థుల పోరాటం నేపథ్యంలో వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయం
- నేడు ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొననున్న కేటీఆర్

2



## ఇందిరమ్మ టవర్స్‌పై బీఆర్ఎస్ విష ప్రచారం

పొంగులేటి

2

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు విక్రయిస్తున్నారన్న ప్రచారంలో అవాస్తవం లేదని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ టవర్స్‌పై బీఆర్ఎస్ పార్టీ విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పేదల జీవితాలతో రాజకీయాలు

## నీట్‌ను రద్దు చేయాల్సిందే

**జంతర్ మంతర్ విద్యార్థుల ఆందోళనకు స్టాలిన్ మద్దతు**

- రాష్ట్రాల విద్యా విధానాలను గౌరవించాలన్న స్టాలిన్
- కోట్లు పిండుకునే కోచింగ్ సెంటర్ల ఆధిపత్యానికి నీట్ రెడ్ కార్పెట్ పరిచిందని మండిపాటు
- రాష్ట్రాల హక్కులు కాపాడబడాలంటే నీట్ రద్దు అనివార్యమని వ్యాఖ్య

2



## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు..

**48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్**

- గ్లోబరీనా టెక్నాలజీస్‌పై చేసిన ఆరోపణలపై వివాదం
- 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక

2



**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లీగల్ నోటీసు పంపారు. గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు సంబంధాలు ఉన్నాయంటూ చేసిన ఆరోపణలపై 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన

## ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ..

**పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం**

- ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు
- కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద పేపర్ లీకేజీ కేసుల విచారణ
- దోషులుగా తేలితే 5 ఏళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా
- తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టేది లేదన్న మోదీ

2



**హైదరాబాద్ పల్స్,డెస్క్**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం

**అమరావతిలో**

## పీఎన్‌బీ క్వాంటం హబ్..

**సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం**

- అమరావతిలో క్వాంటం ఫైనాన్స్ హబ్ ఏర్పాటు చేయనున్న పీఎన్‌బీ
- రాష్ట్ర ప్రభుత్వం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య కీలక ఒప్పందం
- దేశంలోనే ఇలాంటి హబ్ ఏర్పాటు చేస్తున్న తొలి బ్యాంకుగా పీఎన్‌బీ
- బ్యాంకింగ్ సైబర్ భద్రత, మోసాల నివారణే ప్రధాన లక్ష్యం
- డిజిటల్ అక్షరాస్యత పెంచాలని సీఎం చంద్రబాబు సూచన

2



**హైదరాబాద్ పల్స్,డెస్క్**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అత్యాధునిక టెక్నాలజీలకు కేంద్రంగా మార్చే దిశగా మరో కీలక అడుగు పడింది. అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ)లో "క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్"

## యూపీఏ హయాంలో పేపర్లు లీక్..

**కాంగ్రెస్ నేతలు ఎందుకు రాజీనామా చేయలేదు: కిషన్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తోపాటు రాష్ట్రాలలో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహిన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగ వద్దని మరోసారి నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు. పేపర్ లీక్‌పై 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు

2



# ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ..

మొదటి పేజీ రువాయి

చేసింది. ఈ మేరకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్-2024' కింద విచారించనున్నారు.ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు.నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది.నీట్‌తో పాటు యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యువత భవిష్యత్తు, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. "యువత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రతి చుక్కనూ కాపాడుకుందాం

మొదటి పేజీ రువాయి

హాజరయ్యారు.సమీక్ష సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ కరవు పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసేలా అధికారులు వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు.మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను మళ్లీ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేయాలని పొన్నం తెలిపారు. 'వీబీజీ రాంజీ' ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని ప్రతి ఊరిలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలని, పడిన ప్రతి వర్షపు బొట్టునూ వృథా కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు

# పుట్టినరోజు వేడుకలకు దూరం

మొదటి పేజీ రువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు (జులై 24) తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ వీధుల్లో 'నీట్' పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులకు సంపూర్ణ సంఘీభావం తెలపడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఆడంబరాలకు స్వస్తి చెప్పి, విద్యార్థుల హక్కుల కోసం తాము కూడా నేరుగా పోరాటం చేస్తామని తెలిపారు.దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద నీట్ అక్రమాలపై, విద్యా వ్యవస్థలో మార్పుల కోసం డిమాండ్ చేస్తున్న విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్, లాఠీఛార్జ్‌తో విరుచుకుపడటం తీవ్ర సంచలనం సృష్టించింది. విద్యార్థులు కూడా పలువురు పోలీసులపై దాడి చేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సాగుతున్న ఈ పోరాటానికి మద్దతుగా... హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీఆర్ఎస్ విద్యార్థి విభాగం చేపట్టనున్న భారీ నిరసన కార్యక్రమంలో కేటీఆర్ స్వయంగా పాల్గొననున్నారు.

# నీట్‌ను రద్దు చేయాల్సిందే

మొదటి పేజీ రువాయి

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'నీట్' పరీక్షకు వ్యతిరేకంగా రోడ్డెక్కిన విద్యార్థుల పోరాటానికి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ అండగా నిలిచారు. ఆందోళన బాట పట్టిన యువతకు తన పూర్తి మద్దతు ప్రకటిస్తూ 'ఎక్స్' వేదికగా కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును త్రిశంకు స్వర్గంలో పడేసిన నీట్‌ను పూర్తిగా రద్దు చేయడమే ఈ సమస్యకు అసలైన పరిష్కారమని స్పష్టం చేశారు. "రాష్ట్రాల విద్యా విధానాలను గౌరవించండి.. నీట్‌కు వెంటనే స్వస్తి పలకండి" అని డిమాండ్ చేశారు.ఏ ప్రాతిపదికనైతే నీట్ పరీక్షను దేశంలోకి తీసుకొచ్చారో, ఆ ఆశయాలన్నింటినీ ఈ వ్యవస్థ పూర్తిగా నీరుగార్చిందని స్టాలిన్ ఆరోపించారు. సమాన విద్యా అవకాశాలు, పారదర్శకత, నాణ్యమైన విద్య అన్నవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న పాఠశాల విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, కేవలం వేల కోట్లు పిండుకునే కార్పొరేట్ కోచింగ్ సెంటర్ల ఆధిపత్యానికి నీట్ రెడ్ కార్పెట్ పరిచిందని మండిపడ్డారు.విద్యార్థులు వ్యక్తం చేస్తున్న తీవ్ర ఆవేదన ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని స్టాలిన్ వ్యాఖ్యానించారు. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల డాక్టర్ కలలను నీట్ తుంచేస్తోందని.. సామాజిక న్యాయం నిలబడాలన్నా, రాష్ట్రాల హక్కులు కాపాడబడాలన్నా నీట్ రద్దు అనివార్యమని తేల్చిచెప్పారు. ఇకనైనా కేంద్రం తన మొండివైఖరిని వీడాలని కోరుతూ, [illegible] నినాదంతో విద్యార్థుల వైపు నిలబడి పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

# అమరావతిలో పీఎన్‌బీ క్వాంటం హబ్..

మొదటి పేజీ రువాయి

ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మధ్య ఒక ముఖ్యమైన ఒప్పందం కుదిరింది. గురువారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఏపీ క్వాంటం మిషన్, పీఎన్‌బీ ఈ అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా ఒక క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన మొట్టమొదటి బ్యాంకుగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలవడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది.ఈ ఒప్పంద కార్యక్రమంలో పీఎన్‌బీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ చంద్ర, ఏపీ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పాల్గొన్నారు. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌లో ఏర్పాటు కానున్న ఈ హబ్, బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుంది. ముఖ్యంగా బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను గణనీయంగా పటిష్టం చేయడం, ఆర్థిక మోసాలను ముందుగానే పసిగట్టే వ్యవస్థలను అభివృద్ధి చేయడం, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలను సురక్షితంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై ఈ కేంద్రం దృష్టి సారించనుంది.కేవలం బ్యాంకింగ్ రంగానికే పరిమితం కాకుండా, పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సమిష్టి ఆవిష్కరణలకు ఊతమివ్వనుంది. క్వాంటం కంప్యూటింగ్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన టెక్నాలజీలలో పరిశోధనలను ప్రోత్సహించడం, అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించడం కూడా ఈ హబ్ కార్యకలాపాల్లో భాగం కానుంది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా, క్వాంటం, డీప్ టెక్నాలజీలకు ప్రపంచ స్థాయి కేంద్రంగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ హబ్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం ఆ దిశగా వేస్తున్న మరో కీలకమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు.డిజిటల్ లావాదేవీలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, వినియోగదారులకు, సాధారణ ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, బ్యాంకులపై ఉందని పీఎన్‌బీ ఉన్నతాధికారులకు సూచించారు. "డిజిటల్ అరెస్ట్" వంటి ఆధునిక సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే టెక్నాలజీ వినియోగాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు అత్యుత్తమ భద్రతను అందించాలని స్పష్టం చేశారు.పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అశోక్ చంద్ర మాట్లాడుతూ, డిజిటల్ బ్యాంకింగ్‌ను మరింత పటిష్ఠంగా, సురక్షితంగా, సులభతరంగా మార్చేందుకే అమరావతిలో ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కేంద్రం ద్వారా బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎన్‌బీకి చెందిన ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్

# లీగల్ నోటీసులు..

మొదటి పేజీ రువాయి

డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరువు నష్టం దావాతో పాటు సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు.ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని కేటీఆర్ తన నోటీసులో పేర్కొన్నారు. గ్లోబరీనా సంస్థలో తనకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు, యాజమాన్య హక్కులు లేదా బినామీ ప్రయోజనాలు లేవని ఆయన స్పష్టం చేశారు. సదరు సంస్థ తన బినామీ అని, సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.రాష్ట్రంలో అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి, రాజకీయ ప్రత్యర్థిపై ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే రాజకీయ దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు.

# యూపీఏ హయాంలో పేపర్లు లీక్..

మొదటి పేజీ రువాయి

చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. యూపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు.కేంద్రాన్ని ప్రశ్నించే హక్కు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఉందా? అని బల్లగుద్దీ ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని ప్రధాని ఇంటి ముందు ధర్నా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా చట్టాన్ని మరింత కఠినం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పేపర్ లీక్ అయిందని అన్నారు.మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించే సత్తా మీకు ఎక్కడిదంటూ తెలంగాణలోని అధికార పార్టీ నేతల తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

## ఓట్లు లేకుంటే ప్రభుత్వ

# పథకాలు ఎలా వస్తాయి

మొదటి పేజీ రువాయి

ఏజెంట్లను ఏర్పాటు చేసి, నిజమైన ఓట్లు తొలగిపోకుండా పరిశీలిస్తున్నామన్నారు.

**తప్పుడు ఫిర్యాదు చేస్తే**

గతంలో కొడంగల్ కర్ణాటకలో ఉండేదని, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు తెలంగాణలోకి వచ్చిందని సీఎం గుర్తుచేశారు. కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకొని, తన ఓటును బదిలీ చేయించుకున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. తనకు రెండు ఓట్లు ఉంటే ఫిర్యాదు చేయాలని, తప్పుడు ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటానన్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**

ఓటు లేకుంటే ప్రభుత్వ పథకాల అమల్లోనూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశాలు ఉన్నందున, అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు చెప్పారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో లక్షలాది ఓట్లు తొలగించారని, అప్పట్లో కాంగ్రెస్ పార్టీ కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికల సంఘం అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్ సోమేశ్ కుమార్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. కాంగ్రెస్ లక్ష్యంగా సర్ ప్రక్రియ జరుగుతోందని, పార్టీ ఓటు బ్యాంకును దెబ్బతీసే కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు.పేదలకు ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పేదల ఇళ్లను దళారులకు అమ్ముకుందని ఆరోపించారు. ఇప్పుడు నియోజకవర్గ పరిధిలోనే అర్హులైన పేదలకు నాణ్యమైన, ఖరీదైన ఇళ్లు నిర్మించి ఇస్తున్నట్లు వివరించారు.

**కేటీఆర్‌పై తీవ్ర ఆరోపణలు**

గ్లోబరీనా సంస్థపై తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వంలో గ్లోబరీనా సంస్థ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో వ్యవహరించిన తీరుతో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీ సంస్థ అని సీఎం ఆరోపించారు. గ్లోబరీనా వ్యవహారంలో అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌కు ఆ సంస్థతో సంబంధం లేదని భావిస్తే సీసీఎస్‌లో ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఈ విషయంలో కేటీఆర్ తన నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై దేశవ్యాప్తంగా ఉద్యమం జరుగుతుంటే, బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అంశంలో బీఆర్ఎస్ మౌనం ఎందుకని నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకటేనని ఈ విషయం కూడా స్పష్టం చేస్తోందని ఆరోపించారు.తాము తిరిగి ప్రారంభించిన ధర్నాచౌక్‌లోనే, శుక్రవారం కేటీఆర్ ధర్నా చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో శాంతియుతంగా ధర్నాలు, నిరసనలు నిర్వహించుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉందని చెప్పారు. అయితే ప్రజలకు ఇబ్బందులు కలిగితే పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. ఇటీవల తెలంగాణ భవన్‌లో నిర్వహించిన రక్తదానంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ కుటుంబ సభ్యులు, కేటీఆర్ బంధువులు ఎవరైనా రక్తదానం చేశారా అని ప్రశ్నించారు. సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు అందిస్తే మరింత ఉపయోగకరంగా ఉండేదన్నారు.

**హరీశ్‌రావే సమాధానం చెప్పాలి**

హైడ్రా సమర్థవంతంగా పనిచేస్తోందని, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటోందని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ సూచనలను ప్రభుత్వం పూర్తిగా అమలు చేస్తామని చెప్పారు. బ్యారేజ్ దెబ్బతిన్నప్పుడు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు కాఫర్ డ్యామ్ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఇరిగేషన్ శాఖ నుంచి హరీశ్‌రావును కేసీఆర్ ఎందుకు తప్పించారో ఆయనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకున్నారనే కారణంగానే ఆయనను పక్కన పెట్టారని ఆరోపించారు. ఎన్‌డీఎస్ఏ చైర్మన్ నాణ్యత ప్రమాణాలు పరిశీలించడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్, కేంద్ర జలశక్తి మంత్రికి స్వయంగా ఫిర్యాదు చేశారన్నారు. బీజేపీలో అంతర్గత విభేదాల కారణంగానే, ధాన్యం కొనుగోలు వ్యవహారంలో నాయకులు తలోమాట మాట్లాడుతున్నారని సీఎం అన్నారు.

**రోడ్లకు వారి పేర్లు పెడతాం**

రాజధాని నగరంలో హైడ్రా బాగా పని చేస్తోందని సీఎం కితాబిచ్చారు. అనేక ప్రాంతాల్లో ఆస్తులకు రక్షణ కల్పించిందని చెప్పారు. తెలంగాణలో లక్ష కోట్లు పెట్టుబడులు పెడితే వాళ్ల పేర్లను ఆయా రోడ్లకు పెడతామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## ఇందిరమ్మ టవర్స్‌పై

# బీఆర్ఎస్ విష ప్రచారం

మొదటి పేజీ రువాయి

చేయొద్దంటూ ఆ పార్టీ నేతలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హితవు పలికారు. గురువారం తెలంగాణ సచివాలయంలో గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు కడితే బీఆర్ఎస్ పార్టీకి ఎందుకంత అభ్యంతరం అని ప్రశ్నించారు. పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ చేయలేని పని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని స్పష్టం చేశారు.రూ. 40 నుంచి రూ. 60 లక్షల విలువైన ఫ్లాట్‌కు.. లబ్ధిదారుడి వాటా కేవలం రూ. 6 లక్షలు మాత్రమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల సబ్సిడీ అందిస్తోందని వివరించారు. ఇళ్ల కేటాయింపులో 50 శాతం రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. రిజర్వేషన్లలో మహిళలకు 30 శాతం కేటాయిస్తామని అన్నారు. ఎస్సీ 14 శాతం, ఎస్టీ 5 శాతం, బీసీ 16 శాతం, దివ్యాంగులు 5 శాతం, అవుట్‌సోర్సింగ్/4వ తరగతి ఉద్యోగులు/పారిశుధ్య కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ ఉంటుందని చెప్పుకొచ్చారు. ఇళ్ల కోసం మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. మరిన్ని వివరాల కోసం మీ సేవ వాట్సాప్ నంబర్.. 8096958096 ను సంప్రదించాలని మంత్రి పొంగులేటి వివరించారు.

# “ఎస్.ఐ.ఆర్” కోసం 30 ప్రచార రథాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జి.ఎమ్.ఆర్

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23 :** పటాన్చెరు ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనదని, ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యతని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో అభివృద్ధి నిరంతరం కొనసాగటం కోసం అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనవలసోని, ఆగస్టు 3వ తేదీగాతర్వాత తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా



ఏర్పాటు చేసిన 30 ప్రచార రథాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఆయన ప్రకటన ప్రకారం, ఈ రథాలు నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్లు, మూడు మున్సిపాలిటీలు, రెండు మండలాలన్ని వార్డుల వరకు చేరి ప్రజలకు ఎస్ఐఆర్ ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. ముఖ్యంగా ప్రార్థనా స్థలాలు, క్రీడా ప్రాంగణాలు, విద్యా సంస్థలు, పార్కులు, మార్కెట్లు, పారిశ్రామిక ప్రాంతాలు వంటి పరిసరాల్లో వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా సమాచారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనని వారు తమ విలువైన ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 30 ఏళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంగా రాజీవ్ నగర్

**ఓటు అడిగేటప్పుడు మాత్రమే నాయకులు.**

**తర్వాత రాజీవ్ నగర్ అనాథే!**

**మెండి భాస్కర్ ఆదివాసీ నాయకుడు**

**ఓట్ల కోసం వచ్చే నాయకులు సమస్యల కోసం ఎందుకు రావడం లేదు ?**

**రాజీవ్ నగర్‌ను దత్తత తీసుకుని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్ నగర్ గ్రామ ప్రజలు గత 30 సంవత్సరాలుగా అక్కడే నివసిస్తున్నప్పటికీ కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివాసీ నాయకుడు మెండి భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గ్రామంలో నిర్వహించిన మన భద్రాద్రి ప్రింట్ అండ్ ఎలాక్ట్రానిక్ వెల్ఫేర్ సొసైటీ వారి విలేకరుల సమావేశంలో ఆయన గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**”చదువు కోసం నాలుగు కిలోమీటర్లు నడుస్తున్న చిన్నారులు”**

గ్రామంలో సుమారు 80 మంది చిన్నారులు ఉన్నప్పటికీ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో ప్రతిరోజూ నాలుగు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. వర్షాకాలంలో బురదలో, వాగులు దాటి వెళ్లడం వల్ల చిన్నారుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతోందని తెలిపారు.

**”కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేక పిల్లల భవిష్యత్తు అంధకారంలో”**

గ్రామ ప్రజలకు ఇప్పటికీ కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయకపోవడంతో పిల్లల చదువులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని మెండి భాస్కర్ పిల్లల పట్ల భావోద్వేదానికి గురై కన్నీటి





పర్యంతం చెందారు. ప్రభుత్వ హాస్టళ్లలో ప్రవేశాలు, విద్యార్థి వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర విద్యా సంక్షేమ పథకాలకు ఈ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అయినప్పటికీ అధికారులు వాటిని ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎంతో మంది పేద విద్యార్థులు హాస్టళ్లలో చేరే అవకాశాన్ని కోల్పోతూ, ఉన్నత విద్యకు దూరమవుతున్నారని తెలిపారు.

**”కరెంటు లేదు... రహదారి లేదు... జీవితం కష్టాలమయం”**

గ్రామానికి ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేదని, సరైన రహదారి లేక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాత్రివేళల్లో చీకటిలో పాములు, తేళ్ల భయంతో జీవిస్తున్నామని, పలువురు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయని వివరించారు.

**”పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి”**

దశాబ్దాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు ఇప్పటికీ పట్టాలు మంజూరు చేయలేదని, దీంతో రైతులు అనిశ్చితిలో జీవిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇకనైనా ఈ ఆదివాసి గుడాలను ప్రతి ఉంచే పట్టాలి ఇవ్వాల్సిందిగా మనవి చేశారు

**”రేషన్ కార్డు, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు కూడా అందడం లేదు”**

రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఓటరు గుర్తింపు కార్డుల జారీ విషయంలో కూడా తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఫారాలు కూడా ఇవ్వకుండా, బీఎల్‌వోలు గ్రామానికి రాకపోవడం వల్ల ప్రజలు తమ ఓటు హక్కును కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

**”ఓటు అడిగేటప్పుడు మాత్రమే వస్తారు”**

ఎన్నికల సమయంలో నాయకులు, అధికారులు గ్రామానికి వచ్చి హామీలు ఇస్తారని, ఎన్నికలు పూర్తయ్యాక మాత్రం గ్రామ సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నారని మెండి భాస్కర్ విమర్శించారు. వీరు ఓటు కావాలి కానీ వీరి సమస్యలు మీకు పట్టవా అని అధికారులను, నాయకులను నిలదీశారు

**”రాజీవ్ నగర్ పిల్లల భవిష్యత్తును కాపాడండి”**

రాజీవ్ నగర్ గ్రామానికి వెంటనే రహదారి, విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయడంతో పాటు పిల్లల చదువుల కోసం కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను అత్యవసరంగా జారీ చేయాలని, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, గ్రామ ప్రజలకు రేషన్ కార్డులు, ఓటరు గుర్తింపు కార్డులు అందించాలని మెండి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఆదివాసి నాయకులు మెండి భాస్కర్ ఆదివాసి నాయకులు పోడియం నరేంద్ర కుమార్ దానసరి ఎల్లన్న, తాటి వెంకట రమణారావు, తాటి మహేష్‌గ్రామ పెద్దలు, కుంజ బద్రు ముస్కా సన్న కొరస లక్ష్మయ్య మడివి నందయ్య, మడివి భీమరాజు, కొరస వెంకటేష్ అనేకులు పాల్గొన్నారు.

# న్యూ బోయిన్పల్లి చౌరస్తాలో దిష్టి బొమ్మ దహనం

## వార్డు 1 అధ్యక్షుడు మారుతీ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

**బోయిన్పల్లి, జూలై 23,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం ముందు నిర్వహించిన నిరసన సందర్భంగా లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని, ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాను మంగళవారం పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్న ఘటనపై తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీనికి నిరసనగా కంటోన్మెంట్ నియోజక వర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్, డీసీసీ కమిటీ సభ్యుల పిలుపు మేరకు గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా నేతలు,కార్యకర్తలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగారు.అందులో భాగంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఒకటవ వార్డు అధ్యక్షుడు మారుతీ గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ బోయినపల్లి చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ,ధర్మేంద్ర ప్రధాన్ దిష్టి బొమ్మలను దహనం చేసి తమ నిరసనలను ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని వారు మండిపడ్డారు. జాతీయ స్థాయిలో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్, యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం పై నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డీసీసీ నాయకులు బల్వంతరెడ్డి, సదానంద్, గుడ్డు భాయ్, తరుణ్ యువజన కాంగ్రెస్ నాయకులు శరత్, మార్కెట్ డైరెక్టర్ వరప్రసాద్, ఒకటవ వార్డు కాంగ్రెస్ పార్టీ మహిళలు గోమాతి, ఫరాహనా, వరధరాణిస్వాతి కార్యకర్తలు ముఖేష్, రాజుఓం ప్రకాష్ పాల్గొన్నారు.





# విద్యార్థి సంఘాల బంద్.. ఓయూ పరిధిలో రేపటి పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం నాడు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడంతో వర్సిటీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.నీట్ యూజీ 2026 పేపర్ లీకేజీ వ్యవహారం, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ వంటి వామపక్ష, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బంద్‌కు పిలుపునిచ్చాయి. ఢిల్లీలో ‘ఛలో పార్లమెంటు మార్చ్’ నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో, బంద్ కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో అధికారులు ముందుస్తు జాగ్రత్త చర్యగా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నిర్ణయం ఓయూ పరిధిలోని అన్ని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో జేఎన్‌టీయూ-హైదరాబాద్ వంటి ఇతర విద్యాసంస్థలు కూడా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాయి.పరీక్షల వాయిదాతో విద్యార్థులకు తాత్కాలికంగా ఊరట లభించినప్పటికీ, అకడమిక్ క్యాలెండర్‌పై దీని ప్రభావం పడనుంది. వాయిదా పడిన పరీక్షల తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని వర్సిటీ అధికారులు వెల్లడించారు.

# “ఎస్ఐఆర్” హెల్ప్‌డెస్క్‌లను సందర్శించిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి



**రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23 :** భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి నేడు డివిజన్ పరిధిలోని విద్యుత్‌నగర్ మరియు మ్యాక్ సొసైటీ కాలనీలలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌లను సందర్శించారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బి.ఎల్.వో లు) మరియు బూత్ లెవల్ ఏజెంట్లు ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను నింపుతున్న విధానాన్ని పరిశీలించారు. ప్రతి అర్హులైన ఓటరికి సరైన మార్గదర్శనం అందిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, ఏజెంట్లకు సూచించారు.అనంతరం స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓకు అందించాలని, తద్వారా తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాక్ సొసైటీ డైరెక్టర్లు నందగోపాల్, దుర్గా రెడ్డి, రామారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాటి సత్యనారాయణ, దేవేంద్ర చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక




**తొర్రూర్, హైదరాబాద్ పల్స్, జూలై 23 :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో పద్మశాలి టీచర్ వెల్ఫర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బుదారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు దాసరి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి- భోగ సంపత్, కోశాధికారి చందా రవీంద్రకుమార్ లను ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘానికి నియమాలకు కట్టుబడి ఉండి సంఘం ఎదుగుదలకు సహాయపడాలని మరియు తెలివైన, బీద పద్మశాలి విద్యార్థులను గురించి సహాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి టీచర్స్ మరియు కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా చిరంజీవి ఎన్నిక



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, నారాయణ ఖేడ్ :** నారాయణఖేడ్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజి రెడ్డి మరియు రాష్ట్ర కార్యదర్శి బి. రాములు యాదవ్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కన్వీనింగ్ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా చిరంజీవిని ఎన్నుకోగా, కమిటీ సభ్యులుగా లక్ష్మణ్, మోష, బోరంచ గణేష్, షోయల్ రాజేష్, శోభలను నియమించారు.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌గా ఎన్నికైన చిరంజీవి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో జిల్లాలో ప్రజా సమస్యలు, కార్మికుల సమస్యలు, రైతుల సమస్యలు మరియు అన్ని వర్గాల ప్రజల సమస్యలపై ఉద్యమాలు చేపడతామని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసి, సంస్థాగతంగా మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఎఫ్ఎల్ఎన్ పై ఉపాధ్యాయులకు శిక్షణ

**హైదరాబాద్ పల్స్, జూలై 23, నర్సింహులపేట:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో గురువారం 'ఎఫ్ఎల్ఎన్' (ఫండామెంటల్ లిటరసీ, న్యూమరసీ) 'అక్షరాస్యత పునాది ఙ సంఖ్యాశాస్త్రం' పై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కోర్సు డైరెక్టర్, మండల విద్యాశాఖ అధికారి రామ్మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ఆరు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులకు మొదటి దఫాలో 3రోజులు తెలుగు, గణితం మరియు ఆంగ్లము సబ్జెక్టు లపై మూడు రోజులు మండలంలోని ప్రాథమిక , ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. గురువారం తెలుగు, ఆంగ్లం సబ్జెక్టుల పై మండల రిసోర్స్ పర్సన్ లు మహిపాల్ రెడ్డి, శ్రీను, రవి, వెంకన్న, గణేష్ మోహన్ లు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థి యొక్క ప్రస్తుత స్థాయిని అంచనా వేయడంతో మొదలై విద్యార్థి ఏ స్థాయిలో ఉంటే ఆ స్థాయికి తగ్గట్టే బోధనా ప్రక్రియ ని ప్రారంభించి, క్రమంగా తరగతికి చెందిన సామర్థ్యాలు సాధించేలా కృషి చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారా విద్యార్థి నైపుణ్యాలు సాధించిన తరువాతనే, టీచరు విద్యార్థికి అతను చదువుతున్న తరగతికి చెందిన సామర్ధ్యాలు బోధిస్తారని, క్లుప్తంగా చెప్పాలంటే విద్యార్థుల ప్రస్తుత స్థాయికి తగ్గట్టు బోధనాభ్యసన ప్రక్రియని రూపొందించుకుంటూ విద్యార్థులంతా ఎఫ్ఎల్ఎన్




నైపుణ్యాలు సాధించేందుకు ప్రయత్నించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య వుద్దేశం అని అన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, సీఆర్పీ లు శేషుకుమార్, రవి, నాగేశ్వర్ రావు, వీరన్న, మెసెంజర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట

**రూ 5 కోట్ల 50 లక్షలతో మహిళా సంఘ భవనాలు**

**రూ 5.41 కోట్లతో సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం**

**గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూశీకుంట నర్సారెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, గజ్వేల్ :** పల్లెల ప్రగతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుండగా, రూ 5 కోట్ల 50 లక్షల వ్యయంతో 55 గ్రామాలకు మహిళా భవనాలు మంజూరైనట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూశీకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం శాకారంలో మహిళా సంఘ భవనం, సిసి రోడ్డుకు సర్పంచ్ మహమ్మద్ గోరేమియాతో కలిసి ము శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 55 గ్రామాలకు మహిళా సంఘ భవనాలు మంజూరి కాగా, ఒక్కో భవనానికి రూ 10 లక్షలు కేటాయిస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి మొదటి విడతలో రూ 5 కోట్ల 41 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ప్రతి పేదలకు ఇందిరమ్మ





ఇండ్లు మంజూరి చేస్తుండగా, ఇప్పటి వరకు ప్రభుత్వం 6 వేల కేటాయించినట్లు చెప్పారు. అయితే పార్టీలకు అతీతంగా పథకాలను వర్తింపజేస్తుండగా, సర్పంచులు ఈ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటుండగా, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, రైతులకు రూ 2 లక్షల పంట రుణమాఫీ, సన్నధాన్యానికి రూ 500 బోనస్, రైతు భరోసా చెల్లిస్తూ కాంగ్రెస్ సర్కార్ చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అయితే ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రతి ఇంటికి ప్రజా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుశీడగా, గజ్వేల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి అడిగినన్ని నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఖాళీ పోస్టుల భర్తీ చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, కాంగ్రెస్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల బాధ్యులు సాయి గౌడ్, మండల సర్పంచులు, నేతలు చెన్నయ్య, గణేష్, చిట్కుల విజయలక్ష్మి, కుమార్ యాదవ్, డాక్టర్ యాదగిరి, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, సదానంద రెడ్డి, కొండల్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, రాజు, భాను గౌడ్, లక్ష్మీనారాయణ, చిందం మల్లేశం పాల్గొన్నారు.

# ఉత్సాహంగా కొనసాగుతున్న ప్రాంతీయ స్థాయి ఫుట్బాల్ ఎంపిక

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, సిద్దిపేట జిల్లా:** జవహర్ నవోదయ విద్యాలయ, వర్గల్, సిద్దిపేట జిల్లాలో నిన్నటి నుంచి జరుగుతున్న నవోదయ విద్యాలయ సమితి ప్రాంతీయ స్థాయి ఫుట్బాల్ ఎంపికలు ఎంతో ఉత్సాహపరితమైన వాతావరణంలో కొనసాగుతున్నాయని విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీ దాసి రాజేందర్ తెలియజేశారు.మొదటి రోజు అనగా నిన్న జోరు వర్షం వల్ల ఆలస్యంగా ప్రారంభమైన ఈ పోటీలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. అదే విధంగా ఈరోజు 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వరకు జరిగిన అండర్ 19, అండర్ 17 మరియు అండర్ 14 బాలుర ఎంపిక ప్రక్రియ దాదాపుగా ముగిసింది. తదనంతరము నాలుగు గంటల ప్రాంతం నుంచి బాలికల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. బాలికల విభాగంలో కేవలము అండర్ 17 మరియు అండర్ 19 క్యాటగిరి లు మాత్రమే ఉన్నాయి .ఈ ప్రాంతీయ స్థాయి ఎంపికల్లో బాలుర కంటే పాల్గొన్న బాలికల సంఖ్య స్వల్పంగా ఉంది.ఎస్కార్ట్ టీచర్స్, జవహర్ నవోదయ విద్యాలయ అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందము మరియు విద్యార్థులు మైదానంలో పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను నిరంతరము ఉత్సాహ పరుస్తూనే ఉన్నారు. వాళ్ళు చక్కటి ప్రదర్శన ఇచ్చినప్పుడు కరతాల ధ్వనులు మరియు కేరింతలు మైదానమంత వినపడ్డాయి. అన్ని కేటగిరీల్లో ఎంపికైన బాల బాలికల వివరాలను రేపు ముగింపు కార్యక్రమంలో ప్రకటించే అవకాశం ఉంది. ముగింపు కార్యక్రమము ఈనెల 24వ తేదీ అనగా శుక్రవారం ఉదయము 10 గంటలకు ప్రారంభం అవుతుంది. ఈరోజు సాయంత్రం అనగా గురువారం రోజు ఆరున్నర గంటల ప్రాంతంలో




ఎంపీ హాల్లో ఈ ఎంపిక పోటీలకు వచ్చిన బాలబాలికల ద్వారా ఒక కల్చరల్ షో ఏర్పాటు చేయబడ్డది. మంచి వసతి, చక్కటి భోజనము మరియు సమయానుకూలంగా పౌష్టికాహారము తీసుకుంటూ బాలబాలికలు రెట్టింపు ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొని ఒక ఆనందభరితమైన వాతావరణాన్ని నవోదయ విద్యాలయ వర్గల్ ప్రాంగణంలో నెలకొల్పుతున్నారు.

# దేశ భవిష్యత్తును శాసించే విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న మోడీ

**చేసిన తప్పు ఒప్పుకొని విద్యార్థులకు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పాలి**

**గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, సిద్దిపేట జిల్లా:** దేశ భవిష్యత్తును శాసించే వారి జీవితాలతో చెలగాటమాడడం తగదని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి స్పష్టం చేశారు. గురువారం వర్గల్ మండలశీలోని వివిధ గ్రామాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించి ఆయన మాట్లాడారు. చేసిన తప్పును ఒప్పుకొని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్ల వ్యవధిలో వివిధ పరీక్షల ప్రశ్న పత్రాలు లీకవగా, లక్షలాది మంది విద్యార్థుల బ్రతుకులు ఆగమ్య గోచరమైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లికేజీకి బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లేని పక్షంలో ఆయనను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని అన్నారు. అయితే జరిగిన అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కండ్లు తెరిపించేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్, పార్లమెంట్ వద్ద విద్యార్థులు శాంతియుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు అమానుషంగా, విచక్షణారహితంగా లాఠీలతో కొట్టడం, టియర్ గ్యాస్ తో దాడి చేయడం సిగ్గుచేటని నిలదీశారు.



విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ, కేసి వేణుగోపాల్ వంటి ప్రముఖులు ప్రధాని మోడీ నివాసం వద్ద నిరసన తెలపడాన్ని జీర్ణించుకోలేక వారిని అక్రమ అరెస్టులు చేసినట్లు విమర్శించారు.అప్రజాస్వామిక పాలన చేస్తున్న ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని, విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు చేపట్టడంతో పాటు ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబాలను కేంద్రం అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉండి పోరాటం చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు అశోక్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు సాయి గౌడ్, సర్పంచులు, నేతలు గోరెమియా, చెన్నయ్య, కుమార్ యాదవ్, గణేష్, యాదగిరి, రవికుమార్, రవి, గోవర్ధన్ రెడ్డి, కొండల్ రెడ్డి, అజీజ్, సదానంద రెడ్డి, భాను గౌడ్, లక్ష్మీనారాయణ, రాజు, చిందం మల్లేష్, రామచంద్రం, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రాణాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కార్ఖనాలో రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టుకు నిరసనగా దిష్టి బొమ్మ దహనం**





**కార్ఖనా (సికింద్రాబాద్) జూలై 23,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ పిలుపు మేరకు,కంటోన్మెంట్ కాంగ్రెస్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా, అలాగే ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టుకు వ్యతిరేకంగా గురువారం రోజు పికెట్ అంబేద్కర్ విగ్రహం నుండి కార్ఖానా అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నిట్ పరీక్షా పత్రాల లీక్‌లకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్, ఎన్.ఎస్.యూఐ, వివిధ దేవాలయ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్, డీసీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మోదీపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన చేపట్టిన బిజెపి



**హైదరాబాద్ పల్స్, జూలై 23, నరసింహులపేట :** ప్రధాని నరేంద్రమోదీ పై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ వద్ద నిరసన చేసి శాంతియుతంగా రాస్తారోకో చేపట్టారు. అనంతరం రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చీకటి మహేష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని పేర్కొన్నారు. చట్టాన్ని గౌరవిస్తూ శాంతియుత నిరసనలే ప్రజాస్వామ్యానికి బలం అని, హింసాత్మక ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమన్నారు. ఇలాంటి ఘటనలపై తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మానుకోట జిల్లా అధ్యక్షులు దాసరి మురళి, మండల అధ్యక్షులు సతీష్, మహిళా మోర్చా నాయకురాలు రాధా పటేల్, నెలకుర్తి సత్యనారాయణ రెడ్డి, కాలు నాయక్, సందీప్, చిన్నాల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad





# అమ్మ అమృత స్వరూపిణి

అమ్మ అనగానే
అక్షరాలకు ప్రాణం వస్తుంది,
మాటలకు మాధుర్యం
చేరుతుంది,
మనసులకు మమకారం
పరిమళిస్తుంది.

పసిబిడ్డ పలుకుల్లో
అమ్మనే తొలి స్వరం,
మాట రాకముందే
ప్రేమను నేర్పే ఆప్యాయత
రూపం.

నిద్రలేని రాత్రుల్లో
నెత్తిమీద చేయి వేసి వెన్నెలలా
ఓదార్చే చల్లని నీడ,
కన్నీటి క్షణాల్లో
కళ్లను తుడిచే కరుణామయి తల్లి.

తన బాధలను దాచుకుని
ఇంటంతా నవ్వులు పూయించే
వెలుగు,
తన కోరికలను త్యాగం చేసి
కుటుంబ స్వప్నాలకు బాట వేసే
దీపస్తంభం.

ఆమె చేతుల్లోనే
జీవితపు తొలి అక్షరాభ్యాసం,
ఆమె చూపుల్లోనే
ప్రపంచ సౌందర్యం కనిపిస్తుంది.

అమ్మ ఒక పదం కాదు
అమూల్యమైన అనుభూతి,
ఆమె ఒక వ్యక్తి కాదు
అంతులేని ప్రేమకు ప్రతిరూపం.

మాతృదినోత్సవం ఒక్కరోజే కాదు,
ప్రతి రోజు తల్లిని స్మరించుకునే
పండుగ కావాలి.
ప్రతి విజయానికి ఆమె
ఆశీర్వాదమే బలం కావాలి.

అమ్మ ఉంటే
ఇల్లు స్వర్గంలా మారుతుంది,
తల్లి నవ్వితే
జీవితం ఆనందంతో
నిండిపోతుంది.

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
**భాగ్యనగరం**
**(ఈ కవిత్వానికి సంబంధించిన ఘనత గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ గారికి దక్కుతుంది).**

# బోనాలకు ముందే గ్రామానికి కొత్త వెలుగు

**డిప్యూటీ సర్పంచ్ స్వప్న రామదాసు నాయక్ ఆధ్వర్యంలో వీధి దీపాల ఏర్పాటు..**



**హైదరాబాద్ పల్స్, జూలై 23, షాద్నగర్ :** కొత్తూరు మండలంలోని కొడిచెర్ల తండా గ్రామపంచాయతీ పలు తండాలలో లో రాబోయే బోనాల పండుగ సందర్భంగా కలుపు మొక్కల తొలగింపు మరియు హరితహారం కోసం గుంతల తవ్వకం మరియు నూతన వీధి దీపాలు ఏర్పాటు కార్యక్రమాలు ప్రజాప్రతినిధుల చొరవతో రాబోయే బోనాల పండుగను పురస్కరించుకుని డిప్యూటీ సర్పంచ్ స్వప్న రాందాస్ నాయక్, వార్డు సభ్యులు వినోద్ నాయక్, బిచ్య నాయక్, లలిత భాస్కర్ నాయక్, సంతోష్ నాయక్ సంయుక్తంగా అభివృద్ధి పనులు చేపట్టారు. రాత్రి వేళల్లో భక్తులు, గ్రామస్థులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేశారు. అదే సమయంలో రోడ్ల వెంట పెరిగిన కలుపు మొక్కలను డోజర్‌తో తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. రానున్న రోజుల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్ల పక్కన మొక్కలు నాటేందుకు గుంతలను కూడా తవ్వించారు.బోనాల పండుగకు ముందే గ్రామంలో వెలుతురు, పరిశుభ్రత, పచ్చదనం అనే మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పనులు చేపట్టిన డిప్యూటీ సర్పంచ్ స్వప్న రాందాస్ నాయక్, వార్డు సభ్యులు వినోద్ నాయక్, బిచ్య నాయక్, లలిత భాస్కర్ నాయక్, సంతోష్ నాయక్ లను కోడిచర్ల తండా, కాచిగూడ తండాల ప్రజలు అభినందిస్తున్నారు. పండుగను ప్రశాంతంగా, పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తుగా చర్యలు చేపట్టడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.

హైదరాబాద్ పల్స్

# హైదరాబాద్ - ముంబై బుల్లెట్ ట్రైన్‌ను జహీరాబాద్‌లో ఆపండి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, సెంట్రల్ బ్యూరో:**
హైదరాబాద్-ముంబై నగరాల మధ్య ప్రతిపాదించిన హై-స్పీడ్ రైలు కారిడార్ డీపీఆర్‌లో తెలంగాణలోని జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను చేర్చాలని భారత రాష్ట్ర సమితి గట్టిగా కోరుతోంది. ఇక్కడ బుల్లెట్ రైలుకు స్టాప్ మంజూరు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలోని బృందం గురువారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయింది.

**రైల్వే మంత్రికి వివరించిన కీలక అంశాలు:**
పార్లమెంట్ ప్రాంగణంలోని చాంబర్‌లో రైల్వే మంత్రిని కలిసిన వారిలో ఎంపీ వద్దిరాజుతో పాటు ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కే మాణిక్ రావు, మెదక్ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎం.శివకుమార్ తదితరులు ఉన్నారు. దేశవ్యాప్తంగా పారిశ్రామిక, రవాణా రంగాలను కేంద్రం అభివృద్ధి చేస్తున్న తీరును అభినందించిన నేతలు.. జహీరాబాద్ ప్రాముఖ్యతను మంత్రికి వినతిపత్రం ద్వారా సుదీర్ఘంగా వివరించారు.

**ఇండస్ట్రియల్ హబ్:**
జహీరాబాద్ ప్రస్తుతం దేశంలోనే అత్యంత వ్యూహాత్మక పారిశ్రామిక ప్రాంతంగా ఎదుగుతోందని బృందం పేర్కొంది. ఇక్కడ 12,656 ఎకరాల విస్తీర్ణంలో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వివరించారు.

**భూసేకరణ పూర్తి:**
ఈ భారీ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 8,000 ఎకరాల భూసేకరణ పూర్తయిందని వారు మంత్రికి తెలియజేశారు. అలాగే, జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి కూడా కేంద్రం ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు.

**మూడు లక్షల ఉద్యోగాలు:**
నిమ్జ్, ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ, డ్రై పోర్ట్, హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ వంటి మహత్తర ప్రాజెక్టులు పూర్తయితే భవిష్యత్తులో ఈ ప్రాంతంలో మూడు లక్షలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు వస్తాయని వారు వివరించారు.

**దిగ్గజ కంపెనీల అడ్డాగా జహీరాబాద్:**
మహీంద్రా గ్రూప్, అల్లానా, పిరమల్, రాక్‌వూల్, ఆల్ఫ ఇంజినీరింగ్ వంటి దిగ్గజ సంస్థలతో పాటు అనేక ఫార్మాస్యూటికల్, ఆటోమోటివ్, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు ఇప్పటికే జహీరాబాద్‌లో విజయవంతంగా నడుస్తున్నాయని నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటికి అదనంగా నిమ్జ్‌లో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, వేమ్ టెక్నాలజీస్ కు భూములు కేటాయించి శంకుస్థాపనలు కూడా చేసినట్లు తెలిపారు.

**ఆ మూడు రాష్ట్రాలకు ముఖద్వారం:**
జాతీయ రహదారి-65 పై ఉన్న జహీరాబాద్.. అటు



తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులకు వ్యూహాత్మక ముఖద్వారంగా ఉందని నేతలు వివరించారు. బుల్లెట్ ట్రైన్ కు ఇక్కడ స్టాప్ ఇస్తే.. కర్ణాటకలోని బీదర్, హుమ్నాబాద్, బసవకళ్యాణ్, మహారాష్ట్రలోని ఉద్గీర్, లాతూర్ సరిహద్దు ప్రాంతాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.మేక్ ఇన్ ఇండియా, వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు జహీరాబాద్ పారిశ్రామికంగా ఒక గ్రోత్ ఇంజిన్‌గా మారనుందని బీఆర్ఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ భారీ పెట్టుబడుల కోసం వేలాది మంది రైతులు స్వచ్ఛందంగా తమ వ్యవసాయ భూములను దేశ ప్రయోజనాల దృష్ట్యా త్యాగం చేశారని గుర్తుచేశారు. హై-స్పీడ్ రైలు స్టాప్ మంజూరు చేసి.. ప్రపంచ స్థాయి రవాణా సదుపాయాలు కల్పించడం ద్వారా ఆ రైతుల త్యాగానికి తగిన గుర్తింపు ఇవ్వాలని వారు మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు.

# ఎన్.ఎస్.ఎ : నిరసనలపై కేంద్రం ఉక్కుపాదం? ఢిల్లీ పోలీసుల క్లారిటీ..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, సెంట్రల్ బ్యూరో :**
దేశ రాజధాని ఢిల్లీలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో విద్యార్థులు, యువజన సంఘాలు చేపడుతున్న ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. శాంతిభద్రతల పరిరక్షణ సాకుతో ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్‌కు జాతీయ భద్రతా చట్టం కింద ముందస్తు నిర్బంధ అధికారాలను కట్టబెడుతూ ఉత్వర్వులు జారీ చేసింది.

**అక్టోబర్ 18 వరకు ఫుల్ పవర్స్..**
కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఈ మేరకు అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జూలై 19 నుంచి అక్టోబర్ 18 వరకు మూడు నెలల పాటు ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు ఈ ఎన్.ఎస్.ఎ అధికారాలు అందుబాటులో ఉంటాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే లేదా దేశ భద్రతకు భంగం కలిగించే ముప్పు ఉందనుకునే ఎవరినైనా వారెంట్ లేకుండా ముందస్తుగా అరెస్ట్ చేసి 12 రోజుల నుంచి గరిష్టంగా 12 నెలల వరకు డిటెన్షన్‌లో ఉంచే అధికారం ఈ చట్టం ద్వారా పోలీసులకు లభిస్తుంది.

**జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..:**




నీట్ పరీక్ష అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలంటూ వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నారు. ఇటీవల విద్యార్థులు చేపట్టిన పార్లమెంట్ మార్చ్ ను పోలీసులు బారికేడ్లతో అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. లాఠీచార్జ్, బాష్పవాయుగోళాల ప్రయోగంతో ఇరువర్గాల మధ్య ఘర్షణలు చెలరేగి పలువురు విద్యార్థులు, పోలీసులు గాయపడ్డారు.

**ఢిల్లీ పోలీసుల క్లారిటీ..**
ఈ వార్తలపై ఢిల్లీ పోలీసులు స్పష్టత ఇచ్చారు. శాంతిభద్రతల పేరుతో నిరసనకారులను అణచివేసేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని పోలీసులు తీవ్రంగా ఖండించారు. పోలీస్ కమిషనర్‌కు ఎన్ఎస్ఏ (ఎన్.ఎస్.ఎ) అధికారాలు ఇవ్వడం అనేది కొత్తగా తీసుకున్న అత్యవసర నిర్ణయం కాదని, ఇది ప్రతి మూడు నెలలకొకసారి (త్రైమాసికం) క్రమం తప్పకుండా జరిగే సాధారణ పరిపాలనా పునరుద్ధరణ ప్రక్రియ మాత్రమేనని ఢిల్లీ పోలీస్ అధికారికంగా వెల్లడించారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలు ప్రారంభం కాకముందే ఈ అధికారిక ప్రక్రియ పూర్తయిందని వారు స్పష్టం చేశారు.

**నిరసనలతో ముడిపెట్టవద్దు.. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు!**
విద్యాశాఖ మంత్రి రాజీనామాను డిమాండ్ చేస్తూ సీజేపీ మరియు విద్యార్థి సంఘాలు చేపడుతున్న ఆందోళనలతో ఈ ఎన్ఎస్ఏ ఉత్తర్వులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సాధారణ పరిపాలనా మార్గదర్శకాలను ప్రస్తుత నిరసనలకు తప్పుగా ముడిపెడుతూ నిందలు వేస్తున్నారని వివరించారు. పౌరులు, సోషల్ మీడియా వినియోగదారులు ఇటువంటి అవాస్తవాలను, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**పుకార్లు వ్యాప్తి చేస్తే చర్యలు!**
రాజధానిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పౌరుల భద్రతే తమ ప్రాధాన్యమని తెలిపిన అధికారులు, ఆధారాలు లేని వార్తలను షేర్ చేయకూడదని కోరారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో అశాంతి రేకెత్తించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ఆరోగ్యం బాగాలేక సెలవు పెడితే ఉద్యోగం నుంచి తీసేశారు.. టెక్ మహీంద్రాపై ఐటీ ఉద్యోగిని ఫిర్యాదు..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, తెలంగాణ బ్యూరో :**
ఆరోగ్యం బాగాలేదని సెలవు పెడితే తీవ్ర వేధింపులకు గురి చేశారని, చివరకు ఎలాంటి సరైన కారణం లేకుండానే తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించారని ఆరోపిస్తూ భావన అనే ఓ ఐటీ ఉద్యోగిని ఆవేదన వ్యక్తం చేసింది. మేడ్చల్‌లోని టెక్ మహీంద్రా కార్యాలయం ఎదుట ఆమె గురువారం నిరసన చేపట్టి తన గోడును మీడియాకు వెళ్లబోసుకుంది. భావన తెలిపిన వివరాల ప్రకారం.. టెక్ మహీంద్రాలో ఆమె గత నాలుగున్నర నెలలుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా విధులు నిర్వహిస్తోంది. ఇటీవల ఆమె తీవ్ర అనారోగ్యానికి గురైంది. శారీరకంగా కోలుకునేందుకు వైద్యుల సలహా మేరకు 13 రోజుల పాటు సెలవు తీసుకుంది. అయితే అనారోగ్యం కారణంగా ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నప్పటికీ కంపెనీ ఉన్నత స్థాయి ఉద్యోగులు తనను ప్రశాంతంగా ఉండనివ్వలేదని ఆమె వాపోయింది. ఇంకా ఎన్ని రోజులు సెలవు తీసుకుంటావు, త్వరగా ఆఫీసుకు రావాలంటూ తనకు నిత్యం ఈ-మెయిల్స్ పంపుతూ బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపింది. వారి ఈ-మెయిల్స్ వల్ల తాను తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేసింది. అనారోగ్యంగా ఉన్న సమయంలో తనకు సంస్థ అండగా నిలబడకపోగా, తనను వేధింపులకు గురి చేయడం ఎంతగానో బాధించిందని, మహిళలకు ఇలాంటి కార్పొరేట్ సంస్థల్లో సరైన గౌరవం దక్కడం లేదని ఆరోపించింది.

**కుమార్తె కోసం సెలవు అడిగితే కనికరించలేదు:**
భావన అనారోగ్యం నుంచి కోలుకుని తిరిగి విధుల్లో చేరినప్పటికీ యాజమాన్యం తన పట్ల తిరిగి అలాగే ప్రవర్తించిందని భావన తెలియజేసింది. తన కుమార్తెకు ఆరోగ్యం క్షీణించడంతో ఆమెకు సేవలు చేసేందుకు తిరిగి సెలవు అడగాల్సి వచ్చిందని, అయితే ఈ సారి తన పట్ల ఏమాత్రం కనికరం చూపించకుండా ఉద్యోగం నుంచి తొలగించినట్లు చెప్పారని వెల్లడించింది. ఇంకా ఎన్ని రోజులు సెలవులో ఉంటావు, వెంటనే విధుల్లో చేరాలంటూ ఉన్నత స్థాయి ఉద్యోగులు తనపై ఒత్తిడి తెచ్చారని, తన విజ్ఞప్తిని ఏమాత్రం పట్టించుకోకుండా ఉన్న పళంగా తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేసింది. కుమార్తె ఆరోగ్యం విషయంలో సెలవు కావాలని అడిగితే టెక్ మహీంద్రా యాజమాన్యం ఇలా దారుణంగా ప్రవర్తించిందని తెలిపింది. ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తనను అకారణంగా ఉద్యోగం నుంచి తీసేశారని తెలిపింది. ఉద్యోగం నుంచి తొలగించాలంటే 60 రోజుల ముందస్తు నోటీసులు ఇవ్వాలని, అయినప్పటికీ అవేవీ పాటించకుండా తనను తొలగించారని స్పష్టం చేసింది.


**పోలీసులకు ఫిర్యాదు..**
ఆఫీసులో పని వాతావరణం సైతం అత్యంత దారుణంగా ఉంటుందని భావన వెల్లడించింది. కనీసం వాష్ రూమ్‌కు వెళ్లాలన్నా ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. తన ఐటీ కెరీర్‌లో ఇలా నరకం చూపించే కంపెనీని తాను ఎక్కడా



చూడలేదని స్పష్టం చేసింది. సంస్థల్లో ఉద్యోగులను యంత్రాల్లా చూస్తున్నారని, మహిళలకు అయితే విలువ లేకుండా పోతుందని విచారం వ్యక్తం చేసింది. మహిళా ఉద్యోగులకు కేవలం ఆఫీసు పనులే కాకుండా, కుటుంబ బాధ్యతలు కూడా ఉంటాయని, ఐటీ కంపెనీల యాజమాన్యాలు తమ సమస్యలను పట్టించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేసింది. పిల్లలు ఉన్న తల్లుల పట్ల ఐటీ కంపెనీలు ఇంత కఠినంగా, అమానుషంగా వ్యవహరించడం సరికాదని ఆమె అభిప్రాయం వ్యక్తం చేసింది. కాగా ఇదే విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీసులు తగిన చర్య తీసుకుని తనకు న్యాయం జరిగేలా చూస్తారని ఆశిస్తున్నానని వెల్లడించింది. అయితే ఈ ఘటనపై టెక్ మహీంద్రా ఇంకా అధికారికంగా స్పందించలేదు.

## రాముడిని, మోదీని తిట్టడమే నిరసనా.?: ప్రధాని మోదీకి పాక్ మాజీ క్రికెటర్ సపోర్ట్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23 :**
ఢిల్లీలో గత మూడు రోజులుగా నిరసనలు జరుగుతున్న విషయం తెలిసిందే. మోదీ ప్రభుత్వంలో నీట్‌తో పాటు పలు ప్రశ్నాపత్రాల లీకేజీ జరిగిందని.. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో పాటు నిరుద్యోగులు, విద్యార్థులు రోడ్డెక్కారు. ఈ నిరసనలకు కాంగ్రెస్ కూడా తన మద్దతు ప్రకటించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిపక్షాలు నిరసనల్లో పాల్గొంటున్నాయి. ఇదిలా ఉండగా.. ఈ నిరసనలను వ్యతిరేకిస్తూ పాక్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా వివాదాస్పద కామెంట్స్ చేశారు. భారత్‌లో జరిగే ప్రతి నిరసనకు ఒకే స్క్రిప్ట్ ఉంటుందని బాంబు పేల్చారు. విద్యార్థుల నిరసనల వెనుక కూడా కుట్రకోణం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. రాముడిని, మోదీని తిట్టడమే నిరసనా? అంటూ డానిష్ కనేరియా వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఢిల్లీలో విద్యార్థులు నిరసనలు చేస్తున్న తరుణంలో పాక్ మాజీ క్రికెట్ డానిష్ కనేరియా ఈ వివాదాస్పద పోస్ట్ పెట్టి రచ్చ లేపాడు. ఇటీవల కాలంలో భారత్ లో అనేక గొడవలు జరుగుతున్నాయి.. ప్రతి నిరసనకూ ఒకే స్క్రిప్ట్ ఉంటోందని ఆయన విమర్శించారు. నిరసనలు ఎప్పుడు జరిగినా రాముడు, భారత మాత, హిందుత్వం, మోదీ, అలాగే ఆయన తల్లిని దూషిస్తున్నారని ఆయన మండిపడ్డారు. వివాదాలు జరిగినపపుడు చర్చలు, పరిష్కారాలు ఏమీ లేవని.. నినాదాలు, దూషణలు, గందరగోళాలే ఇండియాలో కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇండియాలో కూడా నేపాల్ వంటి పరిస్థితులు వస్తాయని విపక్షాలు కలలు కంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాతో ట్రేడ్ డీల్ జరగకముందే కొందరు రైతులు ఢిల్లీని బ్లాక్ చేసేందుకు వెళ్లడం ఏంటో? ఇది సర్కస్ లాగా మారుతోందంటూ పాక్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా ట్వీట్ చేశారు. దీంతో ఆయన చేసిన కామెంట్స్ దుమారం రేపుతున్నాయి. ఢిల్లీలో జరుగుతున్న అల్లర్లపై డానిష్ కనేరియా మరో వీడియోను కూడా పోస్ట్ చేశారు. శాంతియుత నిరసనల పేరుతో కొందరు కత్తులు తీసుకువచ్చారంటూ ఆయన మండిపడ్డారు. పోలీసులపై కత్తులతో దాడులు చేసేందుకు యత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ప్రధాని మోదీ కఠిన చర్యలు తీసుకోవాలని డానిష్ కనేరియా సూచించారు.



## విద్యార్థుల నిరసలపై ఉక్కుపాదం- వాట్సాప్ నోటీసులు, ఇళ్లలో తనిఖీలు..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, సెంట్రల్ డెస్క్ :**
నీట్ సహా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు ఇప్పుడు ముంబై సహా ప్రధాన నగరాలను తాకాయి. ఢిల్లీ తరహాలోనే విద్యార్థులు ముంబైలోనూ రోడ్లపైకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. దీంతో వీరిని అడ్డుకునేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. విద్యార్థుల నిరసనల్ని మొగ్గలోనే తుంచేసేందుకు ప్రయత్నాలు ఆరంభించింది. ఇందులో భాగంగా ఆందోళనల్లో పాల్గొంటున్న విద్యార్థుల వివరాలను సేకరించి ట్రాక్ చేయడం ప్రారంభించింది. ముంబై పోలీసులు ఇప్పటికే నగరంలో ఆందోళనల్లో పాల్గొంటున్న విద్యార్థులకు వాట్సాప్ ద్వారా నోటీసులు పంపడం ప్రారంభించారు. వీరిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు పంపుతున్నారు. అలాగే విద్యార్థులను వారి మొబైల్ నంబర్ల ఆధారంగా ట్రేస్ చేయడం మొదలుపెట్టారు. అలాగే వారి ఇళ్లకు వెళ్లి తనిఖీలు చేపడుతున్నారు. తద్వారా విద్యార్థుల్ని నిరసనల్లో పాల్గొనకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్ లు లేదా గతంలో లీగల్ నోటీసులు అందుకున్న నిరసనకారులకు, స్థానిక పోలీస్ స్టేషన్ల నుండి నేరుగా ఫోన్ కాల్స్ వెళ్తున్నాయి. అలాగే వాట్సాప్ లో మెసేజ్ లు కూడా వస్తున్నట్లు విద్యార్థులు చెప్తున్నారు. పోలీసులు వారిని ఇళ్లలోనే ఉండమని సూచిస్తున్నారు. అలాగే తమ ఆదేశాలను పాటిస్తున్నారో లేదో నిర్ధారించుకోవడానికి వారి వాట్సాప్ లైవ్ లొకేషన్‌ను నిరంతరం షేర్ చేయమని



ఆదేశిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 35 (3) కింద, తెల్లవారుజామున వివిధ మెసేజింగ్ యాప్ ల ద్వారా డిజిటల్‌గా లీగల్ నోటీసులు పంపుతున్నారు. గతంలో జరిగిన సమావేశాలకు సంబంధించి విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులలో ఆదేశాలు ఇస్తున్నారు.

## దక్షిణ భారతదేశంలో అత్యధిక నిరుద్యోగిత రేటు తెలంగాణలోనే

### బీజేపీ స్టేట్‌చీఫ్ రామచందర్ రావు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. దక్షిణ భారతదేశంలోనే అత్యధికంగా 6.8 శాతం నిరుద్యోగిత రేటు తెలంగాణలో నమోదవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ లేదంటూ ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీల అమలూ లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై బీజేపీ యువమోర్చ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, అందుకే విద్యార్థుల న్యాయమైన హక్కు



కోసం భారతీయ జనతా యువమోర్చా ఈ అంశాన్ని ఉద్యమంగా చేపట్టిందని వెల్లడించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేసే వరకు తమ పోరాటం నిరంతరంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ వెనక్కి తగ్గదని తెలిపారు.


**హైకోర్టు చీవాట్లు పెట్టినా..**
ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి విద్యార్థుల హక్కులను సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, చీవాట్లు పెట్టినా ఈ ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే విద్యార్థులంతా శాంతియుతంగా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం దిగివచ్చి బకాయిలు విడుదల చేసే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ మాత్రమే కాదు... ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు, యువతకు ఇచ్చిన ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ఉపాధి అవకాశాల కల్పన, పరిశ్రమల స్థాపన వంటి అన్ని హామీలను కూడా ప్రభుత్వం అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీ.. బీజేవైఎం, మహిళా మోర్చా ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా అన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను ఏకం చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై విస్తృత ఉద్యమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాల వారీగా ప్రతి విద్యార్థికి అండగా నిలుస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

## "పీఓకే" కు ప్రధాని కావాలని ఉంది..

### పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23 :**
పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ పై పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పీఓకే కు ప్రధాని కావాలని ఉంది అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తనను పీఓకే ప్రధానిగా నియమించాలని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ను అడుగుతానని అన్నారు. కానీ రాజ్యాంగం అందుకు అడ్డుగా వస్తోందని తెలిపారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో ఎన్నికల సందర్భంగా నిర్వహించిన ఓ ర్యాలీలో నవాజ్ షరీఫ్ పాల్గొన్నారు. ఈ మేరకు అక్కడి ప్రజల్ని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు." ఈ ఎన్నికల్లో ఒకవేళ మా పార్టీ గెలిస్తే నన్ను పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ కు ప్రధానిని చేయమని నా సోదరుడు షెహబాజ్ షరీఫ్ ను అడుగుతా. నేను ఆజాద్ కాశ్మీర్ ప్రాంతానికి ప్రధాని అయితే ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం లభిస్తుంది" అని పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ స్పష్టం చేశారు. అంతేకాక పీఓకే తనకు రెండో ఇళ్లు లాంటిదని పేర్కొన్నారు. తమ పూర్వీకులు ఈ ప్రాంతం నుంచే వచ్చారని తెలిపారు. అయితే నవాజ్ షరీఫ్ ఈ వ్యాఖ్యల్ని సరదాకు అన్నారా..? లేక ఏదైనా ఉద్దేశంతో అన్నారా..? అనేది తెలియాల్సి ఉంది. ఎందుకంటే పాకిస్థాన్ రాజ్యాంగంలో ఇలా కొన్ని కొన్ని ప్రాంతాలకు ప్రధానులు ఉండరు.. అని పలువురు చెబుతున్నారు.

**రాజ్యాంగం ప్రకారం..**
పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ కు చెందిన స్థానిక ఓటర్ మాత్రమే ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకోవడం, ప్రధానిగా ఎన్నుకోవడం ఉంటుంది. నవాజ్ షరీఫ్ పంజాబ్ రాష్ట్రానికి చెందినవారు. దాంతో ఆయన పీఓకే ప్రాంతానికి ప్రధాని అవ్వడానికి అనర్హులు. ఇక ఇదే ఎన్నికల ర్యాలీలో పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్ తరపున పాల్గొన్న నవాజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోయినా ఇక్కడి ప్రజలతో తాను సంబంధాలు తెంచుకోనని.. ప్రతి మూడు నెలలకోసారి ఈ ప్రాంతానికి వచ్చి సమస్యలను వింటానని స్పష్టం చేశారు. ఇక పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో జూలై 27 నుంచి ఎన్నికలు జరగనున్నాయి. గత కొద్ది వారాలుగా పాకిస్థాన్ ప్రభుత్వ నిర్బంధ చర్యలు, ఘర్షణల కారణంగా ఇప్పటివరకు 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. దాంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మరోవైపు పీఓకేలో జరుగుతున్న ఈ పరిణామాలపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. ఈ ఎన్నికలు చెల్లవని తేల్చి చెప్పింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు భారత్ లో విడదీయరాని అంతర్భాగాలని స్పష్టం చేసింది. ఆక్రమిత ప్రాంతాల్లో నిర్వహించే ఈ ఎన్నికలను భారత్ గుర్తించదని పేర్కొంది.



## లీక్‌ల చరిత్ర కాంగ్రెస్, బిఆర్ఎస్ లదే.. రాజీనామాలు అడిగే హక్కు మీకెక్కడిది? :కిషన్ రెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, తెలంగాణ డెస్క్ :**
కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు, నీట్ పేపర్ లీకేజీ ఉదంతం, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల విమర్శలపై తీవ్రంగా స్పందించారు. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల పారదర్శకతపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూనే, ప్రతిపక్షాల వైఖరిని ఎండగట్టారు.

**నీట్ పేపర్ లీక్‌పై నిజాయితీగా స్పందన:**
మా ప్రభుత్వ హయాంలో నీట్ పరీక్ష పేపర్ లీక్ అయిన మాట వాస్తవమేనని, ఈ పొరపాటును ఒప్పుకోవడానికి తమకేమీ సంకోచం లేదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వం సమస్యను దాచిపెట్టకుండా తక్షణమే స్పందించిందని ఆయన తెలిపారు. బాధ్యులను అరెస్టు చేసి జైలుకు పంపామని, విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే మళ్లీ నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు 2024లోనే కేంద్ర ప్రభుత్వం కఠినమైన చట్టాన్ని తెచ్చిందని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేస్తామని ప్రధాని మోదీ మాట ఇచ్చారని గుర్తుచేశారు.

**రాజకీయ లబ్ధి కోసమే జంతర్ మంతర్ ఆందోళనలు:**
జంతర్ మంతర్ వేదికగా జరుగుతున్న ఆందోళనల వెనుక కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల రాజకీయ స్వార్థం ఉందని ఆయన ఆరోపించారు. గతంలో షాహీన్ బాగ్ నిరసనల్లో పాల్గొన్న ఆందోళనకారులే ఇప్పుడు విద్యార్థుల ముసుగులో దేశాన్ని నిర్వీర్యం చేసేందుకు 'టుక్డే టుక్డే గ్యాంగ్'గా మారి ఈ నిరసనలు నడిపిస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు.

**రేవంత్ రెడ్డి వైఖరి:**
కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పదో తరగతి పేపర్ లీక్ అయినప్పుడు ఆయన ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. యూపీఏ పాలనలోనూ అనేక ప్రశ్న పత్రాలు లీకయ్యాయని గుర్తుచేశారు. అశోక్ నగర్‌లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను విస్మరించి, రాహుల్ గాంధీ విదేశీ బీచ్‌లలో విహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

**కేటీఆర్ పాలనపై విమర్శలు:**
బిఆర్ఎస్ హయాంలో ఇంటర్మీడియట్ ఫలితాల గందరగోళం వల్ల 26 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీక్ అయినప్పుడు కేటీఆర్ ఏం చేశారో అందరికీ తెలుసని, అలాంటి వ్యక్తి ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. సమస్య వచ్చునప్పుడు సంబంధిత మంత్రి రాజీనామా చేయడం ఒక్కటే దానికి పరిష్కారం కాదని, వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడమే శాశ్వత పరిష్కారమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## పాన్ షాపులో గంజాయి అమ్మకాలు..



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, శేరిలింగంపల్లి : షాపులో గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్న పాన్ డబ్బాపై ఎస్టీఎఫ్ డీ టీం సీఐ నాగరాజు, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. మాదాపూర్ చంద్ర నాయక్ తండా రోడ్డులోని సోహల్ పాన్ షాప్పై దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 500 గ్రాముల బరువున్న 10 ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. 10 గ్రాముల చొప్పున ఉన్న ప్యాకెట్లను రూ.300కు కొనుగోలు చేసి, రూ.500 చొప్పున విక్రయిస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. పాన్ షాపులో గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్న మాలిక్ ఆస్లామ్ టామ్ బోలీ అనే వ్యక్తిని అరెస్టు చేసి, తదుపరి చర్యల కోసం మాదాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

## ఫైబర్ వల్ల శరీరానికి కలిగే ప్రయోజనాలేంటి.. ఎంత మోతాదులో రోజూ తీసుకోవాలి..



ఫైబర్ శరీరానికి అత్యంత అవసరమైన పోషకాలలో ఒకటి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం, పేగుల ఆరోగ్యాన్ని కాపాడడం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం, ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచడం వంటి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. అయినప్పటికీ చాలామంది రోజూ అవసరమైనంత ఫైబర్ తీసుకోలేకపోతున్నారు. రోజూ తినే అన్నంలో ఒక కప్పు పచ్చిబఠానీలను కలిపితే ఫైబర్, ప్రోటీన్ రెండింటినీ సులభంగా పెంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా ఒక కప్పు పచ్చిబఠానీలను కలపడం ద్వారా ఒక్క భోజనంలోనే సుమారు 10 గ్రాముల ఫైబర్, 8.6 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. ఈ కలయిక ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో తరచూ ఆకలి వేయడం తగ్గడంతోపాటు అనవసరంగా చిరుతిండ్లు తినే అలవాటు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా సమతుల్యంగా ఉండేందుకు ఇది సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల పేగుల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

## ‘ఏపీ అస్త్రం’ ఆవిష్కరణ.. భవిష్యత్ పోలీసింగ్‌పై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం




ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థను ఆధునిక సాంకేతికతతో పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా విజయవాడ పోలీసులు రూపొందించిన ‘ఏపీ అస్త్రం’ మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో మూడు రోజుల పాటు జరిగిన ‘ఏపీ పోలీస్ రిట్రీట్–2026: ఫ్యూచర్ పోలీసింగ్’ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం, నేరస్థుల పద్ధతులు పూర్తిగా మారిపోయాయని, ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసింగ్‌లో టెక్నాలజీ వినియోగం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. కేవలం టెక్నాలజీని అందిపుచ్చుకోవడమే కాకుండా, పోలీసు వ్యవస్థ నిర్మాణాన్నే పునః సమీక్షించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. భవిష్యత్ పోలీసింగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లిటరసీ ఆధారంగా నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని చంద్రబాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. 2001లోనే తాను ఫ్యూచర్ పోలీసింగ్ వర్క్‌షాప్ నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అప్పటితో పోలిస్తే నేడు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం, విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు పెరిగాయన్నారు. వీటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పోలీసు వ్యవస్థ పెంపొందించుకోవాలని సూచించారు. పోలీసుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వారి నైపుణ్యాలను పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల అనుభవాన్ని గుర్తించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి కీలక బాధ్యతలు అప్పగించాలన్నారు. ఇందుకోసం సోషల్ మీడియా, సైబర్ నేరాలు, గంజాయి–డ్రగ్స్ నిర్మూలన, మహిళలపై నేరాల నియంత్రణ, కన్విక్షన్ రేటు పెంపు వంటి అంశాల్లో ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ప్రతి పోలీసు సిబ్బందికి డిజిటల్ లిటరసీ తప్పనిసరి అని, పోలీసు ఉన్నతాధికారులు కూడా నిపుణులతో సంప్రదింపులు జరుపుతూ కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. నేరం చేసిన వారికి వేగంగా శిక్షలు పడేలా దర్యాప్తు వ్యవస్థ పనిచేస్తేనే నేరస్థుల్లో భయం పుడుతుందని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ముందస్తు ప్రణాళికలు, సమర్థవంతమైన దర్యాప్తు కీలకమన్నారు. ఈ సందర్భంగా ఏపీ పోలీస్ వెబ్‌సైట్, ధర్మ యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. రోడ్ సేఫ్టీ, క్రౌడ్ మేనేజ్‌మెంట్ సహా 8 అంశాలపై ఏపీ పోలీసులు.. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విట్ యూనివర్సిటీలతో ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నారు. ఫోరెన్సిక్, డాగ్ స్క్వాడ్ విభాగాలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, హోం సెక్రటరీ కుమార్ విశ్వజిత్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ అధికారులు, జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

## 1947 తర్వాత ఆ దేశంలో ఇదే ఆల్ టైం రికార్డ్.. 5,800 మంది బలి!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23 :**
వాతావరణ మార్పుల తీవ్రత ఎంత ఘోరంగా ఉంటుందో ప్రపంచానికి చాటిచెప్పేలా ఫ్రాన్స్‌లో ఇటీవల సంభవించిన తీవ్రమైన వేడి గాలులు నిరూపించాయి. జూన్ 17 నుంచి జులై 2 మధ్య దేశవ్యాప్తంగా విరుచుకుపడిన అసాధారణ ఉష్ణోగ్రతల వల్ల ఏకంగా 5,764 మంది అదనంగా ప్రాణాలు కోల్పోయారని ఆ దేశ ప్రజారోగ్య విభాగం వెల్లడించింది. 2003లో దాదాపు 15,000 మంది ప్రాణాలను బలిగొన్న దారుణ పరిస్థితి తర్వాత, ఫ్రాన్స్ చరిత్రలోనే ఎండల తీవ్రతకు ఇంత పెద్ద ఎత్తున జనాలు బలవ్వడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. సాధారణ రోజుల్లో నమోదయ్యే మరణాల సగటుతో పోలిస్తే, ఈ ఎండల కాలంలో మరణాల సంఖ్య ఏకంగా 36 శాతం పెరిగింది. ఈ వ్యవధిలో సుమారు 15,910 మరణాలు సంభవిస్తాయని భావించగా, అనూహ్యంగా 21,674 మంది కన్నుమూశారు. గతంలో ప్రభుత్వం వేసిన ప్రాథమిక అంచనాల కంటే ఈ సంఖ్య చాలా ఎక్కువ. జూన్ 24, 25 తేదీల్లో ఫ్రాన్స్ చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు




నమోదయ్యాయి. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటేశాయి. 1947 తర్వాత దేశంలో నమోదైన అత్యంత వేడి జూన్ నెలగా ఇది రికార్డులకెక్కింది.

**శవపరీక్షల గదులు కూడా నిండిపోయేలా తీవ్రత!**
దేశ రాజధాని పారిస్ నగరంతో పాటు దాని పరిసర ప్రాంతాలపై ఈ ఎండల దెబ్బ తీవ్రంగా పడింది. ఒక్క పారిస్ రీజియన్‌లోనే దాదాపు 2,000 మంది అదనంగా మరణించారు. అక్కడి పరిస్థితి ఎంత దారుణంగా తయారైందంటే.. అంత్యక్రియలు నిర్వహించే వరకు మృతదేహాలను భద్రపరచడానికి మార్చురీలలో స్థలం కూడా దొరకనంతగా శవాల నిల్వలు పెరిగిపోయాయి. వేసవి సెలవులు ప్రారంభం కాకముందే, పాఠశాలలు, కార్యాలయాలు పనిచేస్తున్న సమయంలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ప్రజలు తట్టుకోలేకపోయారు.

**వృద్ధులపైనే తీవ్ర ప్రభావం.. ఆసుపత్రులు క్రిక్కిరిసిపోయాయి!**
ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారిలో 75 ఏళ్లు పైబడిన వృద్ధులే మూడింట రెండు వంతుల మంది ఉన్నారు. ఎండ దెబ్బకు గురై గుండె సంబంధిత, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తీవ్రమవడంతో చాలామంది కన్నుమూశారు. నమోదైన మరణాల్లో సగానికి పైగా ఆసుపత్రుల్లోనే సంభవించగా, దాదాపు మూడో వంతు మంది ఇళ్లలోనే మృతి చెందారు. కాగా, 1947 నుంచి ఫ్రాన్స్‌లో 53 సార్లు తీవ్రమైన ఎండగాలులు రాగా, అందులో సగానికి పైగా 2010 తర్వాతే నమోదు కావడం.. భూతాపం ఎంత వేగంగా పెరుగుతుందో స్పష్టం చేస్తోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## యూనిఫామ్ వెనుక ఉన్నది మనిషే.. నొప్పి మాకూ ఉంటుంది’.. ఢిల్లీ పోలీసుల భావోద్వేగ పోస్ట్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, సెంట్రల్ బ్యూరో :**
నీట్ పేపర్ లీక్ వివాదంపై జంతర్ మంతర్ వద్ద సిజేపీ చేపట్టిన ‘సంసద్ చలో’ నిరసనలు హింసాత్మకంగా మారడంపై ఢిల్లీ పోలీసులు తీవ్రస్థాయిలో స్పందించారు. విధులు నిర్వర్తిస్తున్న తమ సిబ్బందిపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ.. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఒక భావోద్వేగ పోస్ట్ షేర్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, కానీ హింసకు ఎక్కడా తావులేదని స్పష్టం చేశారు. ‘యూనిఫామ్ ధరించినంత మాత్రాన ఒక మనిషికి నొప్పి తెలియదని కాదు. ప్రతి ఖాకీ బ్యాడ్జ్ వెనుక స్పందించే హృదయం, ఒక కుటుంబం, దేశానికి సేవ చేస్తామన్న ప్రమాణం ఉంటాయి. విధులు నిర్వర్తిస్తున్న పోలీసులపై దాడులు చేయడం తీవ్రంగా కలచివేస్తోంది. అభిప్రాయ భేదాలు ఉంటే గళం వినిపించొచ్చు.. కానీ హింసకు మాత్రం ఏమాత్రం చోటు ఉండకూడదు.’ ఢిల్లీ పోలీస్ అధికారిక ట్వీట్‌లో పేర్కొంది.

**118 మంది పోలీసులకు గాయాలు!**
ఈ నిరసనల సందర్భంగా అల్లరి మూకలు రాళ్లదాడికి దిగడంతోపాటు పోలీసు వాహనాలను ధ్వంసం చేశాయని ఢిల్లీ పోలీసులు తెలిపారు. రాళ్లదాడిలో ఏసీపీ జైప్రకాష్ (నుదుటికి గాయం), ఏసీపీ వివేక్ భగత్ (తలకు, భుజానికి తీవ్ర గాయాలు)లతో పాటు దాదాపు 118 మంది పోలీస్ సిబ్బంది గాయపడ్డారని, వారిలో కొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. నిరసనకారుల ముసుగులో అల్లరి మూకలు వచ్చి చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని పేర్కొంటూ.. ఈ ఘటనపై న్యూఢిల్లీ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో 10 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. విద్యార్థులు పోలీసులపై దాడులకు దిగిన వీడియోలను, గాయపడిన అధికారుల దృశ్యాలను ఈ పోస్ట్‌కు జత చేశారు. నిరసనల్లో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నప్పటికీ, చట్టబద్ధంగా శాంతిభద్రతలను




పరిరక్షించడమే తమ ప్రాధాన్యమని ఢిల్లీ పోలీస్ స్పష్టం చేసింది. అయితే ఈ పోస్టుపై సోషల్ మీడియాలో భిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల పట్ల సానుభూతి కల్పించేందుకే ఈ వీడియో విడుదల చేశారని కొందరు నెటిజన్లు వ్యాఖ్యానిస్తుండగా, నిరసనల సమయంలో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసిన వీడియోలను షేర్ చేస్తూ మరికొందరు కౌంటర్లు ఇస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మా

## రాహుల్ గాంధీ ధర్నాలో నిజాయితీ లేదు.. సోనమ్ వాంగ్‌చుక్ భార్య సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23, సెంట్రల్ డెస్క్ :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు కాంగ్రెస్ చేపట్టిన మెరుపు ధర్నాని ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆగ్మో తీవ్రంగా తప్పుపట్టారు. ఈ మేరకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నివాసం ముందు రాహుల్ ధర్నా చేపట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రధాని ఇంటి ముందు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసనల్లో నిజాయితీ లేదని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు మద్దతుగా నిలవాలనుకుంటే వాళ్లు జంతర్ మంతర్ వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఇండియా టుడేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆంగ్మో ఈ వ్యాఖ్యలు చేశారు. వాంగ్‌చుక్ ఉద్యమాన్ని, గుర్తింపును కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అలాంటి వారికి ప్రజల మద్దతు లభించబోదన్నారు. “ప్రధానమంత్రి నివాసం వెలుపల జరిగిన నిరసనలో నిజాయితీ లోపించింది. ప్రజలను ఇక మోసం చేయలేరు. ఇది చైతన్యవంతమైన భారతదేశం. నిజాయితీ లేనివారిని యువత పక్కన పెడుతుంది” అని ఆగ్మో వ్యాఖ్యానించారు. వాంగ్‌చుక్, విద్యార్థులు చేపట్టిన ఉద్యమాన్ని కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆమె విమర్శించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో




కాక్రోచ్ పార్టీ చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. నిరసనకారులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. పోలీసుల చర్యను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రతిపక్ష ఎంపీలు మంగళవారం మధ్యాహ్నం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు మెరుపు ధర్నాకు దిగిన విషయం తెలిసిందే.

## మట్టిలోని బాక్టీరియాతో క్యాన్సర్‌కు చెక్.. శాస్త్రవేత్తల కొత్త ప్రయోగం!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 23,**
క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కొనే మెరుగైన వైద్య చికిత్సలపై పరిశోధకులు చాలా కాలంగా పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ వాటర్‌లూ, కెనడా శాస్త్రవేత్తలు ఒక కొత్త పద్ధతిని కనుగొన్నారు. ఏంటంటే.. ఇంజనీర్డ్ బ్యాక్టీరియాను ఉపయోగించి క్యాన్సర్‌ను లోపలి నుంచి ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తున్నారు. అదెలాగో ఇప్పుడూ చూద్దాం.

**జన్యు ఇంజనీరింగ్‌తో మార్పి..**
పరిశోధకులు క్లోస్ట్రిడియం స్పోరోజెన్స్ అనే బ్యాక్టీరియాను క్యాన్సర్ నివారణ చికిత్సలో ఉపయోగించే విధానాన్ని డెవలప్ చేశారు. నిజానికి ఇది మట్టిలో సహజంగా దొరికే బ్యాక్టీరియా. ఆక్సిజన్ లేని ప్రాంతాల్లో బాగా వృద్ధి చెందుతుంది. అయితే పరిశోధకులు దీనిని జన్యు ఇంజనీరింగ్ ద్వారా మార్చి, ఆక్సిజన్‌ను కొంత సహించే సామర్థ్యం ఇచ్చారు. అంతేకాకుండా కోరం సెన్సింగ్ (బ్యాక్టీరియా సమ్మేళనం) ద్వారా ‘ఆన్/ఆఫ్ స్విచ్’ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

**క్యాన్సర్ కణాల ధ్వంసం..**
క్యాన్సర్ల విషయానికి వస్తే.. చాలా సాలిడ్ ట్యూమర్ల మధ్య భాగంలో ఆక్సిజన్ చాలా తక్కువగా ఉంటుంది. సాధారణ చికిత్సలు అక్కడికి చేరుకోవడం కష్టం. కానీ క్లోస్ట్రిడియం స్పోరోజెన్స్ బ్యాక్టీరియాలు తక్కువ ఆక్సిజన్ ఉన్న ప్రాంతాల్లో సహజంగా బాగా వృద్ధి చెందుతాయి కాబట్టి.. అవి ట్యూమర్ లోపలికి చేరి, క్యాన్సర్ కణాలను లోపలి నుంచి ధ్వంసం చేస్తాయని పరిశోధకులు అంటున్నారు. క్యాన్సర్‌ను ఖచ్చితంగా ఎదుర్కోవడం, సాధారణ కణాలకు నష్టం తక్కువ కలగడమే ఈ పద్ధతి ప్రధాన లక్ష్యమని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ పరిశోధన ఇంకా ప్రయోగాత్మక దశలో ఉంది. ఇంకా



మానవులపై ఎటువంటి పరీక్షలు జరగలేదు. మరిన్ని ల్యాబ్ అధ్యయనాలు, క్లినికల్ ట్రయల్స్ అవసరమని పరిశోధకులు చెబుతున్నారు. అయితే భవిష్యత్తులో మందులతో పాటు జీవన బ్యాక్టీరియా లేదా ప్రోగ్రామబుల్ సెల్స్ ద్వారా క్యాన్సర్‌ను ఓడించే అవకాశాలు మెరుగుపడతాయనే ఆశలను ఈ పరిశోధన రేకెత్తిస్తున్నదని నిపుణులు పేర్కొంటున్నారు.



## చిన్న సినిమాల్లోనే దమ్ముంటుంది

### 'కర్మాఖ్య' ఈవెంట్‌లో విజయశాంతి

కొత్త ఆలోచనలు, వినూత్న కథలతో వచ్చే చిన్న సినిమాలకు ప్రేక్షకులు, మీడియా నుంచి మరింత ప్రోత్సాహం అందాల్సిన అవసరం ఉందని ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు విజయశాంతి అభిప్రాయపడ్డారు. అలాంటి చిత్రాలకు సరైన గుర్తింపు దక్కితే తెలుగు సినీ పరిశ్రమ మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. 'అదిరే అభి' (అభినయ కృష్ణ) దర్శకత్వంలో తెరకెక్కిన 'కర్మాఖ్య' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయశాంతి ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ వేడుకలో విజయశాంతి మాట్లాడుతూ... "పెద్ద సినిమాలతో పోలిస్తే చిన్న చిత్రాలకు లభించే మద్దతు కాస్త తక్కువే అయినప్పటికీ, నిజమైన దమ్ము, కొత్తదనం, బలమైన కథలు చిన్న సినిమాల్లోనే ఉంటాయి. ప్రేక్షకులు ఇలాంటి వైవిధ్యమైన ప్రయత్నాలను ఆదరిస్తే పరిశ్రమకు మరింత మంది కొత్త నటీనటులు, దర్శకులు వస్తారు. ముఖ్యంగా చిన్న సినిమా నిర్మాతలు నిలదొక్కుకోవాలంటే మీడియా సహకారం చాలా అవసరం. కొత్త కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడంలో మీడియానే కీలక పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు.'కర్మాఖ్య' సినిమాలో నటించిన అభినయ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ... ఈ పాత్ర కోసం ఆమె గుండు చేయించుకోవాల్సిన అవసరం లేదని, కానీ కథపై ఉన్న అంకితభావంతోనే అలా చేశారని విజయశాంతి అభినందించారు. ఆమె పడిన కష్టానికి ప్రేక్షకులు కచ్చితంగా పెద్ద విజయాన్ని అందిస్తారనే నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఇక తన నటన కెరీర్ పై స్పందిస్తూ... ప్రస్తుతం తాను రాజకీయాల్లో బిజీగా ఉన్నందున నటించే ఆలోచన లేదని... అయితే బలమైన కథ, గుర్తుండిపోయే మంచి పాత్ర వస్తే మాత్రం ఆలోచిస్తానని వెల్లడించారు. కాగా, ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ 'కర్మాఖ్య' చిత్రం జూలై 31న థియేటర్లలోకి రాను

# SPORTS

## 'విద్యార్థుల కష్టానికి ప్రతిఫలం దక్కాలి'.. వైరలవుతున్న సచిన్ పోస్ట్..



నీట్ పేపర్ లీకేజీపై జవాబుదారీతనం కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులకు క్రికెట్ దిగ్గజం సచిన్ లటెండూల్కర్ మద్దతు తెలిపాడు. విద్యా వ్యవస్థలో ప్రక్షాళన కోరుతూ జంతర్ మంతర్ వద్ద నిరసన చేపడుతున్న వారికి న్యాయం చేయాలని సూచిస్తూ ఎక్స్‌లో సచిన్ సుదీర్ఘ పోస్ట్ పెట్టాడు. కష్టపడి చదివే విద్యార్థులకు తగిన ప్రతిఫలం లభించే సంస్కృతిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మాస్టర్ బ్లాస్టర్ పేర్కొన్నాడు. తన ఆటతో కోట్లాదిమంది మనసులు గెలుచుకున్న సచిన్.. కేంద్రానికి సూచనలు చేస్తూ పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరలవుతోంది.పోలీసుల లాఠీలకు ఎదురొడ్డి మరీ జంతర్ మంతర్ వద్ద నిరసనలు తెలుపుతున్న విద్యార్థిలోకానికి మద్దతు వెల్లువెత్తుతోంది. తాజాగా క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ విద్యార్థులకు న్యాయం చేయాలని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. స్టూడెంట్స్ తమ కష్టానికి ప్రతిఫలం దక్కనప్పుడు నిరాశకు లోనవుతారు. అప్పుడు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిది అని సచిన్ తెలిపాడు. ఈ సందర్భంగా ప్రొఫెసరైన తన తండ్రిని గుర్తు చేసుకున్నాడు క్రికెట్ గాడ్.'మా నాన్న ఒక ప్రొఫెసర్. ఆయన ఎంతో మంది విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దారు. నాన్న మాకు నేర్పిన పాఠం ఒకటుంది. ఓడిపోయినా పర్లేదు. కానీ, చీటింగ్ చేయొద్దు. విజయం కోసం దగ్గరి దారులు వెతకొద్దు. సమాజంలో పెద్దవాళ్లుగా అలాంటి ఒక సంస్కృతిని పెంపొందించాల్సిన బాధ్యత మనపైన ఉంది. కష్టం కంటే ఫలితాలకే ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రతిభను కాదని షార్ట్‌కట్‌లను నమ్ముతారు. ఈ రోజుల్లో విద్యార్థులు తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కనందుకు నిరాశపడాన్ని అర్థం చేసుకోగలం.ఇకపై వారికి అలా అనుకోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మన యువ భారతం కలలు, శక్తితో నిండినది. యువత మన విజయానికి ఇంధనం. తల్లిదండ్రులు, టీచర్లు, స్నేహితులు, బంధువులు, స్కూల్ నిర్వాహకులు.. మనమంతా ఒక సమాజంగా యువతరాన్ని ప్రోత్సహించాలి. శ్రమకు ఫలితం ఉంటుందని, నిజాయతీకి ప్రోత్సాహం దక్కుతుందని, ప్రతిభే గెలుస్తుందనే సంస్కృతిని మనం ఏర్పాటు చేయాలి. మన పిల్లల భవిష్యత్తు, వారి కలలకు రక్షణ కల్పించడానికి ఒక పరిష్కారాన్ని కనుగొంటామనే నమ్మకం నాకుంది' అని సచిన్ పేర్కొన్నాడు.

### వైభవ్ సూర్యవంశీ దంచుడు...

## జింబాబ్వేపై టీమిండియా ఈజీ విక్టరీ




జింబాబ్వే పర్యటనను భారత జట్టు ఘన విజయంతో ప్రారంభించింది. హరారే వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (50; 19 బంతుల్లో 4ఇ4, 4ఇ6) విధ్వంసకర అర్ధశతకంతో చెలరేగడంతో టీమిండియా సునాయాసంగా నెగ్గింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.126 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ (1) త్వరగా ఔటయ్యాడు. అయితే, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 19 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం పూర్తి చేసి జింబాబ్వే బౌలర్లను ఉతికారేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (35) చక్కటి సహకారం అందించడంతో భారత్ విజయం సులువైంది. వీరిద్దరూ ఔటయ్యాక, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్), తిలక్ వర్మ (6 నాటౌట్) మిగిలిన లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో భారత్ 13.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ రెండు వికెట్లు తీశాడు.అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయం సరైనదని బౌలర్లు నిరూపించారు. యువ పేసర్ మయాంక్ యాదవ్ (2/18) తన వేగంతో జింబాబ్వే బ్యాటర్లను వణికించాడు. మరో పేసర్ ప్రిన్స్ యాదవ్ (2/19) కూడా రాణించడంతో ఆతిథ్య జట్టు 32 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వెస్లీ మధెవెరె (39), తడివానశే మరుమాని (27 నాటౌట్) కాసేపు పోరాడినా స్కోరు బోర్డును వేగంగా ముందుకు నడిపించలేకపోయారు. దీంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు మాత్రమే చేయగలిగింది.

### డోప్‌లో జూడో ప్లేయర్‌కు పాజిటివ్..

## కామన్‌వెల్త్ నుంచి అరుణ్ కుమార్ ఔట్



గ్లాస్‌గోవ్: కామన్‌వెల్త్ క్రీడల్లో ఇండియాకు జలక్ తగిలింది. జూడో ప్లేయర్ అనుణ్ కుమార్‌కు డోప్ నోటీసలు ఇచ్చారు. డోప్ పరీక్షలో ఉత్ప్రేరకాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో కామన్‌వెల్త్ క్రీడల నుంచి అరుణ్ కుమార్‌ను తప్పించారు. పురుషుల 73 కిలోల విభాగంలో అరుణ్ కుమార్ పోటీపడాల్సి ఉంది. కానీ డోప్ పరీక్షలో పాజిటివ్ రావడంతో అతన్ని అనర్హుడిగా ప్రకటించారు. బుధవారం రోజున జాతీయ యాంటీ డోపింగ్ ఏజెన్సీ ఈ నోటీసు ఇచ్చింది. 2026 కామన్‌వెల్త్ గేమ్స్ స్పోర్ట్స్ ఎంట్రీస్ సిస్టమ్ నుంచి అతని పేరును తొలగించారు. అరుణ్ కుమార్ శ్యాంపిల్‌లో ఏఏఎఫ్ ఉన్నట్లు అంతర్జాతీయ జూడో ఫెడరేషన్ పేర్కొన్నది. ఈ విషయాన్ని కామన్‌వెల్త్ క్రీడా నిర్వాహకులతో పాటు భారతీయ ఒలింపిక్ సంఘానికి తెలియజేసింది. అయితే అరుణ్ కుమార్ స్థానంలో మరో జూడో ప్లేయర్‌ను రిప్లేస్ చేయలేమని భారత జూడో సమాఖ్య అధ్యక్షుడు ముకేశ్ కుమార్ తెలిపారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.